యాదగిరిగుట్టలో ఘనంగా తిరువీధి సేవ

జోడు సేవ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 26 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో సాయంత్రం స్వామి, అమ్మవార్లకు తిరువీధి సేవోత్సవం అత్యంత వైభవంగా సాగింది. గురువారం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి స్వామివారిని గరుడ వాహనంపై, అమ్మవారిని తిరుచ్చి సేవపై తిరుమాఢవీధుల్లో ఊరేగించారు. తెల్లవారు జామున 3:30 గంటలకు స్థాన సుప్రభాతాన్ని ఆలకించి స్వామివారిని మేల్కొలిపారు. స్వామివారికి తిరువారాధన, బాలభోగం నివేదన నిర్వహించారు. మంగళాశాసనంతో ప్రాబోదిక కార్యక్రమానికి ముగింపు పలికి భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ సుదర్శన నారసింహ హోమం జరిపారు. స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి గజ వాహన సేవ నిర్వహించారు. వెలుపలి ప్రాకార మండపంలో తూర్పునకు అభిష్టంగా స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి నిత్య తిరుకల్యాణోత్సవం జరిపారు. రాత్రి ప్రధానాలయంలో శయనోత్సవ సేవలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు వైభవంగా నిర్వహించారు.

ధరణి సమస్యలను త్వరగా పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

తుర్కపల్లి, సెప్టెంబర్ 26 : ధరణి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్ అన్నారు. తాసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆయన అకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ధరణిలో ఎలాంటి పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. ధరణి సమస్యలను పూర్తి చేసేందుకు రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ అమరేందర్, తాసీల్దార్ దేశ్యా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

- నాబార్డ్ డీడీఎం వినయ్‌కుమార్

ధీశాలి ప్రగతి నివేదికను ఆవిష్కరిస్తున్న నాబార్డ్ డీడీఎం వినయ్‌కుమార్

బొమ్మలరామారం, సెప్టెంబర్ 26 : మహిళలు స్వయంకృషితో ఆర్థిక ప్రగతి సాధించాలని నాబార్డ్ డీడీఎం వినయ్‌కుమార్ అన్నారు. మండలంలోని సోలిపేట గ్రామంలో గ్రామీణ మహిళా మండలి చైర్మన్ డి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం జరిగిన ధీశాలి రైతు మహిళా ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ఏడో వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలకు పెట్టుబడి సాయం కోసం నాబార్డ్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ప్రస్తుతం 11 గ్రామాల్లో సేవలు అందిస్తున్న సంస్థ జిల్లా వ్యాప్తంగా తమ సేవలు విస్తరించాలని సూచించారు. గ్రామీణ నిరుపేద మహిళలను మార్కెట్ దోపిడీ నుంచి రక్షించుకోవడం, సమాజం అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ ఉత్పత్తులను పండించడం, వాటికి సాంకేతికత జోడించడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఏడీఏ దుర్గేశ్వరి, ఏఓ సునీత, ఏపీ మాస్ చైర్మన్ కళామిని, మదర్ థెరిస్సా రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రాజు, మాజీ ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ చీర్ల రాజేశ్వర్, మాజీ సర్పంచ్ పల్లె ఇందిర, ధీశాలి డైరెక్టర్లు సుజాత, ఈశ్వరమ్మ, చంద్రకళ, సీఈఓ హరిలాల్ పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీ కాకుండా చూడాలి

- మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ లలిత

శిక్షణలో మాట్లాడుతున్న మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ లలిత

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 26 : గ్రామాల్లో పైపులైన్లు, గేట్‌వాల్వ్‌లు లీకేజీ కాకుండా నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ లలిత అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నాలుగు రోజులపాటు మంచినీటి శిక్షణ శిబిరం ప్లంబింగ్‌పై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్యాంకులు, పైపులైన్లు, గేట్‌వాల్వ్ రిపేర్లపై అవగాహన కల్పించారు. పైపులైన్ లీకేజీలు, కారణాలు వాటిని ఎలా సవరించాలో వివరించారు. లీకేజీల రిపేర్ త్వరగా చేసి నిరంతరాయంగా నీటి సరఫరా అయ్యేలా చూడాలని సూచించారు. సమావేశంలో ఎస్ఈ వై.కృష్ణయ్య, డీఈఈ కరుణాకర్, గ్రిడ్ ఈఈ లక్ష్మీనారాయణ, డీఈఈ దీన్‌దయాళ్, ఏఈలు సాయినాథ్‌రెడ్డి, శ్వేత, మిషన్ భగీరథ హెల్పర్లు పాల్గొన్నారు.

జాతీయ మహిళా ఉత్పత్తుల మేళాను ఆదరించాలి

- జిల్లా వ్యవసాయేతర ఉత్పత్తుల ఏపీఎం రమణ

మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయేతర ఉత్పత్తుల ఏపీఎం రమణ

ఆత్మకూరు(ఎం), సెప్టెంబర్ 26 : హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఈ నెల 27నుంచి వచ్చే నెల 7వరకు జరుగనున్న జాతీయ మహిళా ఉత్పత్తుల మేళాను ఆదరించి విజయవంతం చేయాలని జిల్లా వ్యవసాయేతర ఉత్పత్తుల అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ రమణ అన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమైక్య కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ ఈ మేళాలో దేశంలోని అన్ని రాష్ట్రాల మహిళలు చేతివృత్తుల ద్వారా తయారు చేసిన వస్తువులను అమ్మకానికి ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మన జిల్లా నుంచి 11స్టాళ్లు ఏర్పాటు చేశామన్నారు. మేళాను ప్రజలందరూ తిలకించి వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో ఆత్మకూరు(ఎం), మోత్కూర్ మండలాల ఏపీఎంలు పక్కీరయ్య, వెంకన్న, ఎంఎస్‌సీఓ చంద్రస్వామి, వీఓఏలు శ్రీను, విజయలక్ష్మి, నిర్మల, మానస పాల్గొన్నారు.

ఎన్ఎల్ఎం పథకంపై ప్రాథమిక విచారణ

భూమి వివరాలు తెలుసుకుంటున్న జిల్లా పశువైద్యాధికారి వి.కృష్ణ

గుండాల, సెప్టెంబర్ 26 : కేంద్ర ప్రభుత్వ పథకం నేషనల్ లైవ్‌స్టాక్ మెషిన్ కింద మండల కేంద్రానికి చెందిన దేవనబోయిన గణేశ్ దరఖాస్తు చేసుకోగా గురువారం జిల్లా పశువైద్యాధికారి వి.కృష్ణ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసుకున్న రైతుకు చెందిన వ్యవసాయ భూమిలో నీటి వసతి, తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎల్ఎం పథకం కింద గొర్రెలు, మేకలు, పందులు, నాటుకోళ్లు పెంచుకొనుటకు కేంద్ర ప్రభుత్వం 50శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. బ్యాంకు నుంచి 50శాతం రుణం తీసుకుంటేనే ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఈ పథకంలో కోటి రూపాయలకు 500 గొర్రెలు, 25 పొట్టేళ్లు, రూ.80 లక్షలకు 400 గొర్రెలు, 20 పొట్టేళ్లు, రూ.60 లక్షలకు 300 గొర్రెలు, 15 పొట్టేళ్లు చొప్పున ఉంటుందన్నారు. ఆయన వెంట వీఏ ప్రవీణ్, గోపాలమిత్ర గోవింద్, రైతులు ఉన్నారు.

చాకలి ఐలమ్మ పోరాట ధీరవనిత

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి
- జిల్లా వ్యాప్తంగా ఐలమ్మ జయంతి వేడుకలు

బీబీనగర్, సెప్టెంబర్ 26 : నిజాం పాలనకు, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ ధీరవనిత, స్ఫూర్తి ప్రదాత చాకలి ఐలమ్మ అని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. చాకలి ఐలమ్మ 129వ జయంతిని పురస్కరించుకొని మండలంలోని గూడూరు గ్రామంలో గురువారం ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజలకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధపోరాటంలో ముందుండి పోరాడిన వీర వనిత ఐలమ్మ అన్నారు. ఆమె ఆశయాల కోసం మనమందరం పని చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం బాల్‌రెడ్డి, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, శ్యామ్‌గౌడ్, పింగళ్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అచ్చయ్యగౌడ్, బాలకృష్ణగౌడ్, సోమయ్య, జహంగీర్, నిఖిల్‌రెడ్డి, వాసుదేవ్ రెడ్డి, శ్రీశైలంగౌడ్, సత్తిరెడ్డి, బాలరాజు, నివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐలమ్మకు ఘన నివాళి

చాకలి ఐలమ్మ జయంతిని జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, పార్టీ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె పోరాట స్ఫూర్తిని కొనియాడారు. ఐలయ్య ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు.

బీబీనగర్ : గూడూరులో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

ఆలేరు టౌన్ : ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ చైర్మన్ శంకరయ్య

రాజాపేటలో ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తిరుమలేశ్, నాయకులు

ఆత్మకూరు(ఎం) : ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రజక సంఘం, అఖిలపక్ష పార్టీల నాయకులు

మోటకొండూర్‌లో ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న రజక సంఘం నాయకులు

వలిగొండ : ఐలమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది

భూదాన్ పోచంపల్లిలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

చౌటుప్పల్ రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉద్యోగులు

మోత్కూరు : ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎంపీడీఓ నిరంజన్ వలీ

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

రోడ్డు భద్రతా కమిటీ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 26 : రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన గురువారం జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. రోడ్లు అభివృద్ధికి సూచికలని, అలాంటి రోడ్ల మీద ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు తీసుకోవాలని అన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించేలా చూడడం, ప్రమాదాలు జరిగే ముఖ్య ప్రదేశాల్లో ప్రమాద సూచికలు, మలుపుల వద్ద స్పీడ్ లిమిట్స్ సూచికలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. పాఠశాలల వద్ద ప్రత్యేక ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఎయిమ్స్ వద్ద వెహికల్ అండర్ పాస్ కోసం డీపీఆర్ రూపొందించాలని, అనంతరం టెండర్ దశకు వెళ్లాలని సూచించారు. కొండమడుగు దగ్గర అండర్ పాస్ రోడ్డు పనులు నెలలో ప్రారంభం కావాలని, సింగన్నగూడెం అండర్ పాస్ పనులకు టెండర్లు పిలువాలని ఆదేశించారు. రద్దీ ఎక్కున ప్రాంతాలు, బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మెంబర్ కమ్ సెక్రటరీ, రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.బాలప్రసాద్, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఎం.ప్రభాకర్ రెడ్డి, ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎం.ప్రభాకరరెడ్డి, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఇమ్రాన్ అహ్మద్, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ శాఖల ఇంజినీర్లు, నేషనల్ హైవే అథారిటీ, పంతంగి, గూడూరు టోల్‌ప్లాజాల అధికారులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి

వయోవృద్ధుల సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులకు సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం పోస్టర్‌ను విడుదల చేశారు. అక్టోబర్ 1వరకు నిర్వహించే ప్రపంచ వయోవృద్ధుల వారోత్సవాల్లో వయోవృద్ధుల రక్షణ, వారి హక్కుల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అనాథలైన వృద్ధులను గుర్తించి వసతి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ అధికారి కె.నరసింహారావు, తెలంగాణ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, రిటైర్డ్ ఎంప్లాయీస్ బాలేశ్వర్, చంద్రశేఖర్, సోమన్న, రమేశ్, జ్ఞానేశ్వర్, భిక్షపతి, సీడీపీఓలు శైలజ, జ్యోత్స్న, స్వరాజ్యం, రమ, సమీరా మీర్జా, మహిళా సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సునీతపై అనుచిత వ్యాఖ్యలు తగదు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఆలేరు టౌన్, సెప్టెంబర్ 26 : మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతపై కాంగ్రెస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ఆలేరులో గురువారం విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గంగుల శ్రీనివాస్ మాట్లాడుతూ అభివృద్ధి ఏ ప్రభుత్వంలో జరిగిందో చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. మాజీ ఎమ్మెల్యే సునీత హయాంలో ఆలేరు నుంచి కొలనుపాకకు రూ.6కోట్లతో నిర్మించిన రోడ్డు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కొలనుపాకలో రూ.14కోట్లతో బ్రిడ్జి ఎక్కడ నిర్మించారో కాంగ్రెస్ నాయకులు చూపించాలన్నారు. 3నెలల్లో ఆలేరు అండర్ పాస్ నిర్మిస్తామని చెప్పిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఇంత వరకు పని ప్రారంభించలేదని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం అమృత్ స్కీమ్ కింద ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణం కోసం రూ.12కోట్లు మంజూరు చేస్తే కనీసం శంకుస్థాపన కూడా చేయలేదన్నారు. వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీపీ నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేశ్‌గౌడ్, కౌన్సిలర్ బేతి రాములు, కొలనుపాక మాజీ సర్పంచ్ ఆరుట్ల లక్ష్మీప్రసాద్, నాయకులు నరసింహులు, సంపత్, ఫయాజ్ పాల్గొన్నారు.

పనికిరాదన్న కాళేశ్వరం ఇప్పుడెలా పనికొచ్చింది

మాట్లాడుతున్న బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ పరమేశ్

తుర్కపల్లి, సెప్టెంబర్ 26 : పనికిరాదన్న కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఇప్పుడు గంధమల్ల చెరువుకు గోదావరి జలాలు ఎలా వచ్చాయని, దీనికి ప్రభుత్వం, కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ మండల సెక్రటరీ జనరల్ శ్యాగర్ల పరమేశ్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఎందుకూ పనికిరాదని కాంగ్రెస్ నాయకులు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారన్నారు. అలాంటి ప్రాజెక్టు ద్వారా మల్లన్న సాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్ల నుంచి గోదావరి జలాలను రప్పించి నియోజకవర్గంలోని పలు చెరువులను నింపుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం దురుద్దేశంతో కేసీఆర్‌ను బదనాం చేయాలనే పంటలు ఎండబెట్టిందన్నారు. రైతుల నిరసనలతో దిగొచ్చిన ప్రభుత్వం గోదావరి జలాలను విడుదల చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ విప్ ఐలయ్య గంధమల్ల గ్రామస్తులకు ఇచ్చిన హామీ ప్రకారం గుంట వ్యవసాయ భూమి పోకుండా కట్ట ఎత్తు పెంచి చెరువును అభివృద్ధి చేయాలన్నారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ గిద్దె కర్ణాకర్, గంధమల్ల మాజీ సర్పంచ్ అనుముల వెంకట్‌రెడ్డి, నాయకులు రాసాల ఐలేశ్, లింగం, బాలరాజు, యాదగిరి, కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రేషన్ డీలర్ దుర్మరణం

రత్తునాయక్ (ఫైల్)

సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 26 : రోడ్డు ప్రమాదంలో రేషన్ డీలర్ మృతి చెందిన ఘటన మండలంలోని గుడిమల్కాపురంలో గురువారం జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. మండలంలోని వాచ్యతండాకు చెందిన రత్తునాయక్ రేషన్ షాపు నిర్వహిస్తున్నాడు. గురువారం సాయంత్రం పని మీద చౌటుప్పల్ వెళ్తుండగా గుడిమల్కాపురం గ్రామ శివారులో గేదె అడ్డుగా వచ్చి స్కూటీని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వాహనదారులు చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

నీటి సంపులో పడి బాలుడు మృతి

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 26 : పట్టణంలోని రాంనగర్ కాలనీలో నీటి సంపులో పడి బాలుడు మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం పట్టణంలోని రాంనగర్ కాలనీలో బీహార్ రాష్ట్రం పుడ్నియా జిల్లా బదర్‌కోర్ట్ గ్రామానికి చెందిన అర్జున్‌దాస్ కొన్ని రోజులుగా అద్దె ఇంట్లో ఉంటూ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. అర్జున్‌దాస్‌కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. గురువారం సాయత్రం నాలుగు గంటల సమయంలో ఇంట్లో తల్లి నిద్రిస్తుండగా బాలుడు కిరణ్ కుమార్ తన సోదరితో ఆడుకుంటూ ఇంటి ఆవరణలోని నీటి సంపులో పడి మునిగిపోయాడు. అప్పుడే పనికి వెళ్లి వచ్చిన అదే ఇంట్లో అద్దెకు ఉంటున్న సంతోషినికి బాలిక చెప్పడంతో నీటి సంపులో చూసింది. అప్పటికే బాలుడు మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

సంతోష్‌గౌడ్‌కు సన్మానం

ఆలేరు రూరల్, సెప్టెంబర్ 26 : ఇటీవల ఆదర్శ కళానిలయం రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్న భీమగోని సంతోష్‌గౌడ్‌ను మండలంలోని కొలనుపాకలో గురువారం అఖిలపక్ష నాయకులు అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మోత్కూరి ఐలయ్య, మాజీ ఎంపీటీసీ మామిడాల అంజయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రాజు, నాయకులు సురేందర్ రెడ్డి, బాలమల్లేశ్, నర్సింహులు, అశోక్, సోమిరెడ్డి, శంకర్, కుమార్ పాల్గొన్నారు.

న్యాయవాదులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలి

పోస్ట్ కార్డులు రాస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 26 : బార్ కౌన్సిల్‌లో 2019 తర్వాత నమోదు చేసుకున్న న్యాయవాదులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని భువనగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బబ్బూరి హరినాథ్, ఐలు జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి అన్నారు. న్యాయవాదులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరుతూ భువనగిరి కోర్టు ఆవరణలో గురువారం ప్రభుత్వానికి పోస్ట్ కార్డులు రాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రికి చేరేలా రాష్ట్ర వ్యాప్తంగా పోస్టు కార్డు ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు. న్యాయవాదులకు అడ్వకేట్ వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా హెల్త్ కార్డులు ఇచ్చేలా ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు కలకుంట్ల జయ, సహాయ కార్యదర్శి మట్ట వెంకటేశ్వర్లు, ఐలు జిల్లా కమిటీ సభ్యులు ఎండీ మిహాల్, ఐలయ్య, మల్లేశ్, నరేశ్, విద్యాసాగర్, రాజశేఖర్, జంగయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, ఐలయ్య, ప్రభాకర్, కిషన్, కిరణ్, యాదయ్య, నరహరి, ప్రసాద్, సాయికిరణ్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి : మున్సిపల్ చైర్మన్

మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 26 : భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. వన మహోత్సవంలో భాగంగా పట్టణంలోని 9, 22, 23, 31వ వార్డుల్లో గురువారం మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో 2లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా తీసుకున్నామన్నారు. ఇంటింటికీ ఆరు రకాల మొక్కలు అందజేస్తామని, నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని సూచించారు. కార్యక్రమాలలో ఆయా వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

- మున్సిపల్ చైర్మన్ రాజు

మున్సిపల్ సిబ్బందితో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయిస్తున్న చైర్మన్ రాజు

చౌటుప్పల్, సెప్టెంబర్ 26 : పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆర్పీలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను వీధుల్లో వేయకుండా స్వచ్ఛ ఆటోల్లో వేసేటట్లు ఆర్పీలు చూడాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బండమీది మల్లేశ్, సుల్తాన్ రాజు, నాయకులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, కామిశెట్టి భాస్కర్, బొబ్బిళ్ల మురళి, మున్సిపల్ సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చాలని వినతి

మున్సిపాలిటీ పరిధిలోని వలిగొండ రోడ్డులో గుంతలను పూడ్చాలని, ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని కేపీఆర్ నగర్ కాలనీవాసులు మున్సిపల్ చైర్మన్ రాజుకు వినతిపత్రం అందజేశారు. పెద్ద గుంతలు ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, వలిగొండ, తంగడపల్లి క్రాస్ వద్ద ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య తగ్గించొద్దు

- బీఆర్ఎస్వీ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేశ్

డిప్యూటీ తాసీల్దార్ భగత్‌కు వినతి పత్రం ఇస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

బీబీనగర్, సెప్టెంబర్ 26 : ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య తగ్గిస్తే విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని బీఆర్ఎస్వీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కి నగేశ్ అన్నారు. సర్కారు బడుల్లో టీచర్ల సంఖ్య తగ్గించవద్దని తాసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాసీల్దార్ భగత్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ 25 తీసుకొచ్చి ప్రాథమిక